క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 27న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. జులైవాడ, సుబేదారి ప్రధాన రహదారి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, శాయంపేటలోని అవంతి స్కూల్ ఏరియాలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా గణేష్



మామునూరు: కాంగ్రెస్ పార్టీ ఖిలావరంగల్ మండల అధ్యక్షుడిగా మామునూరుకు చెందిన జన్ను గణేష్ నియమితులయ్యారు. మంగళవారం హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు గణేష్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి వచ్చేలా, కార్యకర్తల సంక్షేమానికి మరింతగా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను నియమించిన ఎమ్మెల్యే నాగరాజు, నియామకానికి సహకరించిన మండల నేతలకు గణేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పీఎఫ్ కమిషనర్ ఆధ్వర్యంలో నిధి ఆప్కి నికత్

కాజీపేట: హనుమకొండలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్, సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిధి ఆప్కి నికత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ ప్రణీత్ జోషి తెలిపారు. రీజినల్ పీఎఫ్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో యజమానులు, పీఎఫ్ సభ్యులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుంది. కార్యక్రమానికి యజమానులు, సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

త్రిపుర గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు



మడికొండ: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సోమవారం మొదటిసారి వరంగల్‌కు వచ్చిన సందర్భంగా రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు నివాసగృహంలో మడికొండకు చెందిన నాయకుడు, ఎల్కతుర్తి మండల ఇన్‌చార్జ్ పానుగోటి వెంకట్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మహేందర్, వెంకటేష్, శివ, మౌళి, చంటి తదితరులు ఉన్నారు.

రేపు సంకటహర చతుర్థి పూజలు

కాజీపేట: పట్టణంలోని 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణముఖ అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు, గణపతి హోమం, అలంకరణ పూజలు జరిపించనున్నట్లు పేర్కొన్నారు.

సైన్స్ దినోత్సవంపై రేపు ఉపన్యాస కార్యక్రమం

కేయూ క్యాంపస్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 28న కాకతీయ యూనివర్సిటీలో విషయ నిపుణులచే ఉపన్యాస కార్యక్రమాన్ని పరిపాలనా భవనంలోని సెనెట్‌హాల్‌లో ఉదయం 9–30 గంటలకు నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ రమేష్ హాజరుకానున్నట్లు తెలిపారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

హన్మకొండ: ఓటు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కేంద్ర స్వీప్ నోడల్ ఆఫీసర్ భవాని శంకర్ అన్నారు. సోమవారం హనుమకొండ గోపాల్‌పూర్‌లో జిల్లా స్వీప్ నోడల్ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. భవాని శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గిన ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ నం 83, 87లో యాభైశాతా నికంటే పోలింగ్ తక్కువైందన్నారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్ పాల్గొన్నారు.

వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

హన్మకొండ: రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రధాని మోదీ ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ జంక్షన్‌లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గడిచిన పదేళ్లుగా మోదీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతూ రైతులను, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు చట్టాలను ఉపసంహరించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం లేదని, కౌలు రైతుల రక్షణకు చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. ఇలాంటి ప్రజా, రైతుల, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడిన మోదీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, భిక్షపతి, ఎల్లేష్, లక్ష్మణ్, అనిల్, నారాయణ, రవి, సంతోష్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, శంకర్ నాయక్, రాంచంద్రారెడ్డి, మనోహర్, రమేష్, దేవా పాల్గొన్నారు.



హన్మకొండ: ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



కరీమాబాద్: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కరీమాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మికుల వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ఏకశిల పార్క్ నుంచి ర్యాలీ నిర్వహించి వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మేకల రవి, షేక్‌బాషామియా, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, బుస్స రవీందర్, గుండె బద్రి, జన్ను రవి, ల్యాదెళ్ల శరత్, కండె నర్సయ్య, యాకుబ్, సుధీర్, రాజు, అక్బర్, సువర్ణ పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

ఖిలా వరంగల్: మతాలకతీతంగా హజ్రత్ సయ్యద్ రౌషన్ షహీద్ రహ్మతుల్లాహి హలై ఉర్సు షరీఫ్ ఉత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా అధ్యక్షుడు సయ్యద్ షా ఆరిఫొద్దీన్ హుస్సైనీ సాబేరి తెలిపారు. నగరంలోని మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఖమ్మం ప్రధాన రహదారిపై ఉన్న రౌషన్ షహీద్ మసీద్ దర్గా ప్రాంగణంలో అధ్యక్షుడు ఆరిఫొద్దీన్ హుస్సైనీ సాబేరి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 800 ఏళ్ల చరిత్ర కలిగిన అతిపురాతనమైన మసీద్ దర్గాగా పేరొందిందన్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి భారీగా రానున్న భక్తులకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 8 గంటలకు గంధం ఉత్సవాలు ప్రారంభమై రాత్రి 12.30 గంటల వరకు కొనసాగనున్నాయని తెలిపారు. ఉత్సవాలకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హాజరై గంధం ఉత్సవాలు ప్రారంభిస్తారని చెప్పారు. మతపెద్దల సమక్షంలో ఫకీర్ల విన్యాసాలు, జెండా ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముస్లిం పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సయ్యద్ షా ముజాహిద్ ఖాద్రీ, ఎండీ.అబ్రహం, ఎండీ.ఖాద్రీ, ఎండీ.రహిమత్ బాబా, సయ్యద్ నవాజ్ అలీ,ఎండీ.రషీద్, ఎండీ.నజీర్, సయ్యద్ రబ్బానీ, ఎండీ ఖాజా పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ ఆరిఫొద్దీన్ హుస్సైనీ

నందీశ్వరుడికి వెండి కొమ్ముల బహూకరణ

మడికొండ: మెట్టుగుట్టపై ఉన్న నందీశ్వరుడికి 260 గ్రాముల వెండి కొమ్ములను హనుమకొండకు చెందిన తాళ్లపల్లె బాలకిషన్–హేమలత దంపతులు బహూకరించారు. సోమవారం మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఆలయంలో ఉన్న నందీశ్వరుడి కొమ్ములకు వెండి కొమ్ములను బహూకరించారు. అలాగే కాజీపేట మండలం రాంపూర్‌కు చెందిన చందరాజు ఉమాదేవి–యాదగిరి దంపతులు 280 గ్రాముల వెండితో స్వామి వారికి బిల్వపత్రాల మాలను సమర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్, మాజీ చైర్మన్ కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, పైడిపాల రఘుచందర్, అర్చకులు అభిలాష్‌శర్మ, సత్యనారాయణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



వెండి కొమ్ములను బహూకరించిన అనంతరం పూజలో పాల్గొన్న బాలకిషన్ దంపతులు

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి



మడికొండ: విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ సూచించారు. సోమవారం మడికొండ శివారులోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర, బాలికల కళాశాలలో విద్యార్థులకు పరీక్షలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ ప్రతాప్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే సమయంలో ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అప్పుడే కన్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తెచ్చిన వారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు దివ్య, రాజాబాబు, కళాశాల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డబ్ల్యూటీఓ నుంచి బయటికి రావాలి



హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

వరంగల్ చౌరస్తా : ధనిక దేశాల ప్రయోజనాలకు ఉపయోగపడే ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యూటీఓ) నుంచి భారత్ బయటికి రావాలని రైతు కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ 164 దేశాలతో కూడిన డబ్ల్యూటీఓలో ధనిక దేశాలదే ఆధిపత్యం అని వాటి కనుసన్నల్లోనే పేద దేశాల ప్రభుత్వాలు నడుచుకుంటున్నాయన్నారు. డబ్ల్యూటీఓ సమావేశాలు ఈనెల 26 నుంచి 29 వరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబిలో 13వ శిఖరాగ్ర సమావేశాలు జరగబోతున్నాయన్నారు. దేశ రైతాంగం పండించిన పంటలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేసి ప్రజాపంపిణీ వ్యవస్థ పేద ప్రజలకు అందించేవని నేడు ఈ వ్యవస్థను రద్దుచేసి వారి ఖాతాల్లో డబ్బులు వేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు రాచర్ల బాలరాజు, వీరగోని శంకరయ్య, కోరబోయిన కుమారస్వామి, ఓదెల రాజయ్య, సుదమల్ల భాస్కర్, కార్మిక సంఘాల నాయకులు ప్రతాప్, రమేష్, రామస్వామి, దయాకర్, రాజు, ఎండీ. బషీర్, రాజేందర్, ఎండీ.పాషా, మల్లికార్జున్ పాల్గొన్నారు.

‘సంరక్ష’లో డయాబెటిక్ స్క్రీనింగ్ క్యాంపులు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

కాశిబుగ్గ : వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 21 రోజుల పాటు నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత డయాబెటిక్(షుగర్) స్క్రీనింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. సోమవారం ఆస్పత్రిలో క్యాంపులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడంతో షుగర్ వ్యాధి వస్తుందన్నారు. ముందుగానే గుర్తించి వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఈక్యాంపు ఉదయం 8 గంటల నుంచి 10 గంటలకు వరకు కొనసాగుతుందని తెలిపారు. క్యాంపులో బీపీ, బ్లడ్‌షుగర్ పరీక్షలతో పాటు ఉచిత ఫిజీషియన్ కన్సల్టేషన్, అవసరమైతే ఈసీజీ కూడా ఉచితంగా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ డాక్టర్ తిరుపతిరెడ్డి, ఎండీ.డాక్టర్ దిడ్డి శ్రావణ్‌కుమార్, డైరెక్టర్లు డాక్టర్ అజిత్ మహమ్మద్, డాక్టర్ పోలా నటరాజ్, డాక్టర్ నవీన్, వైద్యులు లక్ష్మీదీపక్, శ్రీనివాస్, మే ఘన, సురేష్, శ్రావ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ డ్యూటీమీట్‌లో కానిస్టేబుల్ ప్రతిభ

మామునూరు : ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఇటీవల జరిగిన 67వ ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో మామునూరు టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ నాగేంద్రబాబు జాతీయ స్థాయిలో ఫొటోగ్రఫీ, పోలీస్ వీడియోగ్రఫీలో అత్యంత ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకున్నాడు. సోమవారం నాలుగో బెటాలియన్ క మాండెంట్ కార్యాలయంలో కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి నాగేంద్రబాబును అడిషనల్ కమాండెంట్ ఎంజీఎస్.ప్రకాశ్‌రావు, ఏసీలు రాంబాబు, వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు.

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

హన్మకొండ: సఖి కేంద్రం సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆ కేంద్రం కేస్ వర్కర్ వి.వినీల అన్నారు. సోమవారం హనుమకొండ భవానీనగర్‌లో సఖి వన్‌స్టాప్ కేంద్రంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వినీల, లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి మాట్లాడుతూ లైంగిక వేధింపుల బారిన పడుతున్న చిన్నపిల్లల కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ యాక్ట్ తీసుకొచ్చిందన్నారు. మహిళల కోసం గృహహింస చట్టం తీసుకొచ్చిందని వివరించారు. సఖి కేంద్రం ద్వారా విడిపోయే భార్యాభర్తలను కౌన్సిలింగ్ ద్వారా ఒకటిగా కలుపనున్నట్లు తెలిపారు. వరకట్న, లైంగిక వేధింపులు, ఆడపిల్ల వద్దని అకారణంగా గర్భవిచ్ఛిత్తి చేయించేందుకు వేధింపులకు గురి చేసిన వారికి, వేధింపులతో మానసికంగా కుంగిపోయే మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. సఖి కేంద్రం సాయం కోసం 0870–2452112, టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలన్నారు. సదసుల్లో సిబ్బంది కె.హరిత, మానస, ఎండీ. ఖాజా, తిరుపతి, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

రాజయ్యను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించాలి

కాజీపేట : స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ మరింతగా పటిష్టంగా తయారవుతుందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఎడబోయిన ప్రభాకర్ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉన్న నాయకుడిగా గుర్తింపును సాధించిన రాజయ్య కాంగ్రెస్‌లోకి రావడాన్ని స్వాగతించాలన్నారు. ఎంపీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన్‌పూర్ నియోజకవర్గంలో మంచి ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డితో పాటు ముఖ్య నాయకులు రాజయ్యను పార్టీలో చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డీసీసీ సంయుక్త కార్యదర్శి వి.సతీష్‌రెడ్డి, దాసరి ప్రణీత్, ఎస్‌డీ.ఇబ్రహీం, ఎనగందుల మనోహర, గండికోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ముగిసిన కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ పరీక్షలు

కాజీపేట: పట్టణంలోని విజేత ఉన్నత పాఠశాలలో సోమవారం ఈ అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ పరీక్షలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 66 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏప్రిల్ 13న హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో జరిగే 10వ అభ్యాసోత్సవ్‌లో బహుమతుల ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో ఈ అభ్యాస్ సంస్థ సీఈఓ డాక్టర్ ఫణి పవన్, పాఠశాల డైరెక్టర్ బండి ప్రదీప్‌కుమార్, బండి కల్పన, అకడమీ మేనేజర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శరత్

ఖిలా వరంగల్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష సమయాల్లో హాల్ టికెట్స్ ఇవ్వని కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు జరుగనున్న ఇంటర్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారుసమావేశంలో సాగర్, శివకుమార్, సంతోష్, రాజేష్, సవిల్, అభిరామ్, ప్రభాస్ , ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించాలి



కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్‌డీ బాధ్యులు

విద్యారణ్యపురి: కోనో కార్పస్ చెట్లు విరివిరిగా పెరిగాయని వాటివలన అనారోగ్యమే కలుగుతున్నందున ఆయా చెట్లను తొలగించాలని ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఎఫ్‌డీ) బాధ్యులు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు విన్నవించి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో హరితహారం పేర నర్సరీల్లో విరివిరిగా పెంచి వాటిని మున్సిపల్ ప్రాంతాల్లో, గ్రామాల్లో కూడా ఆయా చెట్లను పెంపుదల చేశారన్నారు. కోనో కార్పస్ చెట్ల గాలిపీలిస్తే ఊపిరితిత్తుల వ్యాధులు, అస్తమా, మాతృత్వం కోల్పోవటం లాంటి సమస్యలు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆయా చెట్లను తొలగించాలని కలెక్టర్‌కు విన్నవించామన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఆ విభాగ్ కన్వీనర్ నిఖిల్, బాధ్యులు ఆరెపెల్లి సుజిత్, కౌశిక్ తాళ్లపెల్లి అరుణ్, శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

ఖిలా వరంగల్: శివనగర్‌లోని రుద్రమాంబనగర్‌కు చెందిన తోట రమేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ దర్శపరపతి సంఘం ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

No. 27 NOTICE OF SALE UNDER ORDER 21 RULE 64 C.P.C.
IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE, AT NARSAMPET

E.P. No.256 / 2017
in O.S. No.27 / 2009

Between:-
Siluveru Ravinder ...Decree Holder
AND
Gajula Sivakumar & others ...Judgement Debtors

To,
1. **Gajula Shiva Kumar,** S/o: Late Sadanandam, Age: 47 yrs, Occ: Auto Driver, R/o: H.No. 16-10-719, Shiva Nagar, Warangal.
2. **Gajula Harikumar Alias Harish,** S/o: Late Sadanandam, Age: 40 yrs, Occ: Private Employee, R/o: H.No.11-3-382/1, 17-36/3, 2nd floor, Srinivas Nagar Colony, Padmarao Nagar, Secunderabad.
3. **Gajula Sarojini,** W/o: Late Sadanandam, (died) per L.R's.
4. **Gangula alias Gajula Saraswathi,** W/o: Gangula Sadanandam, D/o: Late Gajula Sadanandam, Age: 51 yrs, Occu: House-wife, R/o: Flat A-402, Asopalav Co-op., Housing Society Ltd., Kasturi Park, Navagar Road, Bhayander East, Dist: Thane, Maharastra.
5. **Katabathini alias Gajula Mahalaxmi,** W/o: Late Srinivas, D/o: Late Gajula Sadanandam, Age 50 yrs, Occu: House-hold, R/o: 1st floor, Laxmi Apartments, Opp: Municipal building, Kombad pada, Bhiwandi, Dist: Thane, Maharastra.
6. **Bandari alias Gajula Dhanalaxmi,** W/o: Ram Thilak, D/o: Late Gajula Sadanandam, Age: 44 yrs, Occu: House-wife, R/o: H.No. 16-10-719, Shiva Nagar, Dist: Warangal.
7. **Gajula Satish Kumar,** S/o: Late Sadanandam, Age: 34 yrs, Occ: Private Employee, R/o: H.No.11-3-382/1, 2nd floor, Srinivas Nagar Colony, Padmarao Nagar, Secunderabad.

Whereas in the above mentioned E.P. No. 256 of 2017 the Decree-Holder has applied for the sale of E.P., Schedule mentioned property, for realization of Decreetal amount as per the Decree dated 10th March, 2011, passed in O.S. No. 27 of 2009, on the file of this Court.

You are hereby informed that the **19th day of April 2024** has been fixed for settling the terms of proclamation of sale.

//BY ORDER OF THE COURT//

Date: 25-02-2024. Sd/-

Alladi Veerabhadraiah, B.Sc. LLM.
Alladi Veerendar, LLM.
Advocates
8-12-2, JPN Road, Warangal - 506 002

విద్యుత్ అంతరాయాల్లేకుండా చూడాలి

హన్మకొండ: వినియోగదారులకు అంతరాయాల్లేకుండా మెరుగైన విద్యుత్ అందించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్, హనుమకొండ ఎస్ఈ మధుసూదన్ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజన్ కార్యాలయంలో సోమవారం డీఈలు, ఏడీ, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఇందులో మధుసూదన్ మాట్లాడుతూ.. లైన్లను పర్యవేక్షిస్తూ.. విద్యుత్ అంతరాయాల్లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సూచించారు. గృహజ్యోతి పథకం అమలు తీరును అధికారులకు వివరించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పని చేయాలన్నారు. సమావేశంలో డీఈలు విజేందర్‌రెడ్డి, జి.సాంబరెడ్డి, ఏడీఈలు నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, మల్లికార్జున్, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీకాంత్ కాలనీలో చోరీ

వరంగల్ క్రైం : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీకాంత్ కాలనీలో రెండు రోజుల క్రితం ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. లక్ష్మీకాంత్ కాలనీకి చెందిన కావటి నర్సయ్య రెండు రోజుల కిత్రం మేడారం జాతరకు వెళ్లి ఆదివారం తిరిగి వచ్చి చూసుకునే సరికి ఇంటి వెనకవైపు తాళం పగులగొట్టి ఉంది. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా పగులగొట్టి ఉందని ఆయన తెలిపాడు. బీరువాలో ఉన్న రూ.1.30 లక్షల విలువ గల మూడు తులాల బంగారం ఆభరణాలు చోరీ జరిగినట్లు ఆయన తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బస్టాండ్‌లో చైన్ స్నాచింగ్

వరంగల్ క్రైం: హనుమకొండ బస్టాండ్‌లో ఆదివారం సాయంత్రం చైన్‌స్నాచింగ్ జరిగినట్లు హనుమకొండ సీఐ సతీష్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం అవుతాపురం గ్రామానికి చెందిన తోటకూరి రజిత ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు పుస్తెల తాడును అపహరించినట్లు ఆయన పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

ఎంజీఎం : ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే ఐఎన్‌టీయూసీ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, కొప్పు ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. సోమవారం ఎంజీఎం ఆస్పత్రిలో ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 104 వాహన సేవలను పునరుద్ధరించాలని, 142 జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంజీఎం బ్రాంచి అధ్యక్షుడు గడల ప్రేమలత, శాంతకుమారి, ప్రీతి, రాజ్యలక్ష్మి, శైలజ, అనీష్, నవీన్, సిద్ధయ్యచారి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజారోగ్య వైద్య ఉద్యోగులు

జేఏసీ నిర్ణయంతో సంబంధం లేదు

హన్మకొండ: పరికి సదానందానికి తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ మద్దతు ప్రకటించడంతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఆ జేఏసీలో సభ్య సంఘమైన బీఎంఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీందర్, ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్ తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న సదానందానికి మద్దతు పలకడంపై జేఏసీలో ఎలాంటి చర్చ జరగలేదని వారు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కొన్ని యూనియన్లకు చెందిన నాయకుల అభిప్రాయాన్ని జేఏసీ అభిప్రాయంగా ఎలా చెబుతారని వారు ప్రశ్నించారు. తాము దినపత్రికల్లో చూసి అవాక్కయ్యామన్నారు. కనీసం జేఏసీ నాయకులు కానీ, వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని ఆశిస్తున్న సదానందం కూడా తమ యూనియన్‌కు మాట మాత్రం కూడా చెప్పలేదని, తమ మద్దతు కోరలేదని స్పష్టం చేశారు. సదానందానికి తమ యూనియన్ ఎలాంటి మద్దతు ప్రకటించలేదని తెలిపారు.